మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు తీసుకోవాలి

- జెర్రిపోతుల మైసమ్మ దగ్గర వాగు ఉధృతిని పరిశీలించిన మంత్రి నిరంజన్ రెడ్డి
- గోపాల్‌పేట-వనపర్తి మధ్యలో తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో స్థంభించిన రాకపోకలు



జెర్రిపోతుల మైసమ్మవాగును పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** అకాల వర్షాలకు ప్రజలు, రైతులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధికారులకు ప్రజలకు పిలుపునిచ్చారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గురువారం వనపర్తి పట్టణానికి సమీపంలోని గోపాల్‌పేట రోడ్డులో జెర్రిపోతుల మైసమ్మ వాగు దగ్గర కొనసాగుతున్న వరద ఉధృతిని మంత్రి పరిశీలించారు. వనపర్తి, గోపాల్‌పేట మధ్యలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు వాగు ఉధృతిని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉధృతంగా సాగుతున్న ప్రవాహాలను దాటే సాహసం చేసి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని మంత్రి సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు సహాయక చర్యలకు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. జెర్రిపోతుల మైసమ్మ దగ్గర ప్రధాన రోడ్డు



రైతులతో కలిసి ఊర చెరువును పరిశీలిస్తున్న ఎంపీపీ మేఘారెడ్డి

పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో తాత్కాలికంగా నిర్మించి మట్టిరోడ్డు తెగిపోవడంతో గోపాల్‌పేట, వనపర్తి కి మధ్యలో రాకపోకలు స్థంభించాయి. అనంతరం నల్లచెరువు, తాళ్ల చెరువు ను సందర్శించి ఎంబీ చర్చ్ గ్రౌండ్ ను మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, టీఆర్ఎస్ జిల్లా కన్వీనర్, రాచాల పురుషోత్తం రెడ్డి, కౌన్సిలర్ సత్యం సాగర్ ఉన్నారు.



నీట మునిగిన వరి, వేరుశనగ పంటలు

- భారీ వర్షానికి తెగిపోయిన దొడకుంటపల్లి ఊర చెరువు..
- నీట మునిగిన 150 ఎకరాల వరి, వేరుశనగ పంటలు..



తెగిపోయిన దొడకుంటపల్లి ఊర చెరువు కట్టను పరిశీలిస్తున్న మంత్రి

**పెద్దమందడిలో..** బుధవారం రాత్రి ఒక్కసారిగా పెద్దఎత్తున కురిసన భారీ వర్షానికి వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడకుంటపల్లి గ్రామానికి చెందిన ఊర చెరువు తెగిపోయింది. చెరువు తెగిపోవడంతో చెరువు కింద ఉన్న 150 ఎకరాల్లో గ్రామానికి చెందిన రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ పంటలు పూర్తిగా నీట మునిగి రైతులను నష్టాలకు గురి చేసింది. గ్రాస్థులు, రైతులు చెరువు గండి పూడ్చే ప్రయత్నం చేసినప్పటికి చెరువులో నీటి ఉధృతికి గ్రామస్థులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గ్రామస్థులు స్థానిక ఎంపీపీ మేఘారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన చెరువు దగ్గరికి వచ్చి పరిస్థితిని సమీక్షించి సంఘటనను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి దొడకుంటపల్లి ఊర చెవును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఇరిగేషన్ అధికారులు ముందుగా దృష్టి సారించి చెరువు కట్టలను పటిష్టపరచాలని అధికారులు మంత్రి ఆదేశించారు. దొడకుంటపల్లి ఊర చెరువు తూము కు మరమ్మత్తు చేసేందుకు నివేదికలు తయారు చేయడం జరిగిందని అంతలోపే ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకోవడం దురదృష్టమని మంత్రి పేర్కొన్నారు. నెలరోజుల్లో చెరువు కట్టను పటిష్టపరిచి పునరుద్దరించాలని ఇరిగేషన్ ఎస్ఈ సత్యశీల రెడ్డిని మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీపీ మేఘారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షుడు రాజప్రకాష్ రెడ్డి, స్థానిక సర్పంచ్ వరలక్ష్మి, గ్రామ టీఆర్ఎస్ నాయకులు, రైతులు అశోక్ రెడ్డి, కాటం నారాయణ రెడ్డి, కొన్నూరు శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్, ఉన్నారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో జలప్రళయం

- పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు
- సరళాసాగర్ ప్రాజెక్టులో తెరుచుకున్న సైఫన్ సిస్టం
- కాజ్‌వే పై ప్రవహిస్తున్న వరదనీరు
- పలు రహదారుల్లో రాకపోకలకు అంతరాయం
- పాలమూరు, కొడంగల్, బిజినేపల్లిలలో భారీ వర్షాలు
- రంగంలోకి దిగిన రెస్క్యూ టీంలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 06 ప్రభాతవార్త :** గత రాత్రినుండి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షం జలప్రళయం సృష్టించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా కుండపోత వర్షం కురుస్తుండడం వల్ల జనజీవన స్రవంతిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా జనం అతలాకుతలమయ్యారు. జిల్లాలోని నదులు, వాగులు, వంకలు వరద కారణంగా పొంగి ప్రవహిస్తున్నాయి. జూరాల ప్రాజెక్టు, సుంకేసుల, ఆర్డీఎస్, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి రిజర్వాయర్లు వరదనీటితో కళకళలాడుతున్నాయి. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో ఉన్న సరళాసాగర్ ప్రాజెక్టు సైఫన్ సిస్టం తెరుచుకోవడంతో వరదనీరు ఒక్కసారిగా కాజ్‌వేపైకి చేరుకుంది. మదనాపురం మండలం ఊకచెట్టివాగు వద్ద భారీ స్థాయిలో వరదనీటి ప్రవాహం కనిపిస్తుంది. దీంతో కాజ్‌వే పైకి వరదనీరు రావడంతో ఆత్మకూర్, కొత్తకోట వైపు వెళ్లే ప్రధాన రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు కోయిల్‌సాగర్ భారీ వరద నీటి కారణంగా ఐదు గేట్లను తెరిచి 3600 క్యూసెక్కులు నీటిని దిగువకు వదులుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో భారీ వర్షం కారణంగా చెరువు కట్ట తెగిపోవడంతో సమీప ఇళ్లలోకి వరదనీరు చేరడంతో అక్కడ పరిస్థితి అతలాకుతలంగా మారింది. ముఖ్యంగా బాలాజీనగర్ కాలనీ నీటమునిగింది. అదేవిధంగా బిజినేపల్లి మండలంలో కూడా రికార్డు స్థాయిలో వర్షం కురవడం వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మహబూబ్‌నగర్, కొడంగల్, బిజినేపల్లిలలో వర్షం కారణంగా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ టీం సహాయక చర్యలు ముమ్మరం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పరిస్థితి దయనీయంగా ఉంది. గత రెండు రోజుల నుండి జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురుస్తున్న కారణంగా లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. రామయ్యబౌలి, బికెరెడ్డి కాలనీ, పాత పాలమూరు, గణేష్‌నగర్, భగీరథ కాలనీ, న్యూటౌన్, రాయిచూర్ రోడ్డు, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో వరదనీరు నిండి పారుతుంది. దీంతో పట్టణ వాసులు బయటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. మహబూబ్‌నగర్ - రాయిచూర్ ప్రధాన రహదారి వద్ద వరదనీటి కారణంగా ముంపుకు గురైన బాధితులు వర్షం నీళ్లలోనే ఆందోళన నిర్వహించి నిరసన తెలియజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాన్ని వరదనీరు ముంచెత్తడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు తదితరులు లోతట్టు ప్రాంతాలను సందర్శించి సహాయక చర్యలకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రికార్డు స్థాయిలో 49.3 మి.మీ. వర్షపాతం నమెదు కాగా, చిన్నచింతకుంట మండలంలో 13.4 మి.మీ. స్వల్ప స్థాయిలో వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 479.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు, కొత్తచెరువు వరద నీటితో అలుగులు పారాయి. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలో చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. భవిష్యత్తులో ఎంత పెద్ద వరద వచ్చినా పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు రాకుండా నిబంధనల ప్రకారం ఉన్న నాళాలను వెడల్పు చేసి శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రజలకు భరోసా కల్పించారు.

## దసరా వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి



సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి నివాసంలో టీపీసీసీ అధ్యక్షులు, మల్కాజిగిరి ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి

**వెల్దండ, అక్టోబర్ 06, ప్రభాతవార్త:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని వెల్దండ మండల కేంద్రంలోని సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఇంటికి టీపీసీసీ అధ్యక్షులు, మల్కాజ్‌గిరి ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం విచ్చేశారు. సర్పంచ్ ఇంటికి రేవంత్‌రెడ్డి వచ్చారనే సమాచారం తెలుసుకున్న వెల్దండ మండల వాసులు పెద్ద సంఖ్యలో సర్పంచ్ ఇంటికి చేరుకొని రేవంత్‌రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపి పలువురు శాలువాలతో సన్మానించి సెల్ఫీలు దిగి సంబురాల్లో మునిగితేలారు. ప్రతి యేడాది దసరా పర్వదినాన యెన్నం భూపతిరెడ్డి ఇంటికి విచ్చేస్తున్న క్రమంలోనే ఈ యేడాది కూడా విచ్చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. రాజకీయ పరంగా కాకుండా స్నేహపూర్వకంగా ప్రతి యేడాది దసరా పర్వదినాన కలుసుకోవడం ఒక అనుబంధంగా ఏర్పరుచుకున్నామని సర్పంచ్ తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ కుటుంబ సమేతంగా ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో విజయడైరీ చైర్మన్ యం.డి.యాఖుబ్, డాక్టర్ హరికాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యెన్నం కృష్ణారెడ్డి, వై.శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## -కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పర్యవేక్షించిన అధికారులు

**దేవరకద్ర, అక్టోబరు 06, ప్రభాతవార్త :** జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు అయినటువంటి కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లు గురువారం తెరవడంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద ఉన్న వివిధ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ దేవరకద్ర మండల అధికారులు, స్థానిక ఎంపిడిఓ, ఎంపిఓ, డిప్యూటి తహసిల్దార్, ఆర్ఐ సురేష్, స్థానిక ఎస్సై భగవంత్‌రెడ్డిలు కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించి ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉండడం, అలాగే కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరు నిర్లక్ష్యం చేయరాదని ముందస్తుగా గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల అధికారులు, కోయిల్‌సాగర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కోయిల్‌సాగర్ వద్ద అధికారుల సందర్శన

## భారత్ జోడా పాదయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించిన చిన్నారెడ్డి



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం

**మక్తల్, అక్టోబరు 06 ప్రభాతవార్త :** భారత్ జోడో పాదయాత్ర రూట్ మ్యాప్‌ను మాజీ మంత్రి జిలెల్ల చిన్నారెడ్డి పర్యవేక్షించారు. ఆయనతో పాటు నియోజకవర్గ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, మాజీ పిసిసి అధికార ప్రతినిధి రాజుల ఆశిరెడ్డిలు ఉన్నారు. వారి సమక్షంలో వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన కర్నె గ్రామ యువకులు భీమేష్, హన్మంతు, శేఖర్, నరేష్, నర్సింహులు, రాజు, రఘుగౌడ్, వెంకట్, రమేష్, అంజిగౌడ్, శ్రీను, రామలింగం గౌడ్, అంజప్ప, వెంకటప్ప, నింగప్ప, రంగప్పలను పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాగనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఉట్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, నాగేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, ఆనంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# క్రమపద్ధతిలో నాళాల ఏర్పాటు చేస్తాం

- పెద్దచెరువు నుండి నీరు వెళ్లే నాళా ఆక్రమణలను తొలగిస్తాం
- రామయ్య బౌలిలో నాళాను ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్న వారందరూ అధికారులకు సహకరించాలి
- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 06 ప్రభాతవార్త :** భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి మహబూబ్‌నగర్ పట్టణంలోని రామయ్యబౌలి, బికెరెడ్డి కాలనీ, శివశక్తినగర్ ప్రాంతాలలోకి నీరు రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలో మరోసారి కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలలోకి నీరు రావడంతో ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం అనుకోకుండా ఫ్లాష్ ఫ్లడ్స్ రావడం, తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం కురియడం వల్ల రామయ్యబౌలి, శివశక్తినగర్, బికెరెడ్డి కాలనీ వంటి లోతట్టు ప్రాంతాలలోకి నీరు వచ్చిందని తెలిపారు. పెద్దచెరువు, ఎర్రకుంట అలుగులు వెళ్లే ప్రాంతాలలో నాళా ఆక్రమణలకు గురి కావడం వల్ల ఇళ్లలోకి నీరు వస్తున్నదని గుర్తించడం జరిగిందని, ఆక్రమణల వల్ల రామయ్యబౌలిలో సుమారు 100 మీటర్ల నాళా 5 మీటర్లకు పడిపోయిందని, అదేవిధంగా బికె రెడ్డి కాలనీలో కూడా జరిగిందని తెలిపారు. రామయ్యబౌలి ప్రాంతంలో 67 ఇండ్లు, నాళా ఆక్రమణలో నిర్మించుకోగా, 32 ఇండ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయని, వీటన్నింటిని తొలగించి సహజసిద్ధంగా వెళ్లే వరద నీటికి ఎలాంటి అడ్డంకి లేకుండా చేసి నీరు సులభంగా వెళ్లేలా నాళాను నిర్మించి శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఈ కాలనీలలోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో నాళాను వెడల్పు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం నాళా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. నాళా ఆక్రమించుకుని నిర్మాణాలు చేసుకున్న వారందరు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తప్పుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి రాజకీయం చేయవద్దని మంత్రి కోరారు. గతంలో పట్టణంలో రహదారుల వెడల్పు సందర్భంగా కూడా అనేక మంది అడ్డం పడ్డారని, రహదారుల విస్తరణ తర్వాత పట్టణ రహదారులు విశాలంగా మారి పట్టణం సుందరంగా, పెద్ద నగరంలా కనిపిస్తున్నది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయని తెలిపారు. నాళాల ఆక్రమణలు తొలగిస్తే నీరు సాఫీగా వెళ్లి పక్కన ఉన్న కాలనీలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. నాళాల ఆక్రమణల తొలగింపులో అధికారులకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిష్పక్షపాతంగా ఆక్రమణలు తొలగించి శాశ్వత పరిష్కారం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు ఆక్రమించుకున్నా తొలగిస్తామని, మహబూబ్‌నగర్‌ను ఒక ప్రణాళిక బద్ధమైన పట్టణంగా తీర్చిదిద్దాలనేదే లక్ష్యమని అన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత 15 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, ఇరిగేషన్ ఇంజనీర్లు చక్రధరం, దయానంద్, మనోహర్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, తహసిల్దార్ పార్థసారథి తదితరులు ఉన్నారు.

# అంబరాన్నంటిన దసరా సంబురాలు



దసరా ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



దసరా ఉత్సవాల్లో స్వర్ణభారతి కళా నిలయం కళాకారులు, చిన్నారులతో

**కల్వకుర్తి, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** విజయదశమిని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంతో గ్రామాల్లో దసరా ఉత్సవాలు అంబరాన్నంటాయి. బుధవారం దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రక్కన గల ప్రభుత్వ స్థలంలో విజయదశమి వేడుకలను నిర్వహించారు. జమి షమీయతే పాపం..షమీ శత్రువినాశనం... అర్జునషయ్య.. ధనుర్ధారి, రామశయ్య ప్రియదర్శిని అని షమీ పూజను కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, శ్రీశ్రీశ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబుల ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు పూజలు చేశారు. విజయదశమి వేడుకల్లో భాగంగా స్వర్ణ భారతి కళా నిలయం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో ఈ ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జిల్లా జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ముఖ్య అతిథిగా హాజరై రావణసుర దహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలకు విరాళాలు అందజేసిన దాతలతో పాటు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లను పూలమాలలు, శాలువాలుతో ఘనంగా సన్మానించారు. జమ్మి ఆకును ఒకొరికొకరు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలో కల్వకుర్తి సీఐ సైదులు, ఎస్ఐ రమేష్‌యాదవ్, పోలీస్ బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, టీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్‌గౌడ్, కౌన్సిలర్లు సూర్యప్రకాష్‌రావు, బోజిరెడ్డి, గోపిరెడ్డి లక్ష్మి రాంరెడ్డి, కుడుముల చైతన్య కిశోర్‌రెడ్డి, తలసాని సౌజన్య జనార్ధన్‌రెడ్డి, గోరటి శ్రీను, చిన్న, మున్సిపల్ స్పెషల్ నాలెడ్జ్ పర్సన్ కుడుముల మనోహర్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బావండ్ల మధు, నాయకులు ఎడ్మ మాధవరెడ్డి, రాఘవేందర్‌గౌడ్, కృష్ణగౌడ్, దుర్గప్రసాద్ తదితరులు ఉన్నారు.

# దేవరకద్రలో రాహుల్‌గాంధీ జోడోయాత్రకు సన్నాహాలు

- రేవంత్‌రెడ్డితో కలసి రాయచూర్‌లో రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన మధుసూధన్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్
- 26 తర్వాత ఎప్పుడైన దేవరకద్రకు రాహుల్‌గాంధీ రాక
- రాయచూర్, మక్తల్‌ల మీదుగా దేవరకద్రకు



రూట్‌మ్యాప్ చేయడానికి జిల్లాకు వచ్చిన రేవంత్‌రెడ్డితో మధుసూధన్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్

**దేవరకద్ర రూరల్, అక్టోబరు 06 ప్రభాతవార్త:** దేవరకద్రలో జరుగు కాంగ్రెస్ ఛీఫ్, ఏఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జోడోయాత్రకు ఆ పార్టీ నాయకులు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు. దీనికి గాను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ యంపి మల్లు రవితో కలసి ఆ పార్టీ టీపీసీసీ కార్యదర్శి జి.మధుసూధన్‌రెడ్డి(జియంఆర్), సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ గురువారం రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఈ నెల 26 తర్వాత రాహుల్‌గాంధీ జోడోయాత్ర నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడవల్లూర్ గ్రామం వద్ద తెలంగాణలో ప్రవేశనుంది. ఆ తర్వాత అక్కడి నుండి రాహుల్‌గాంధీ మక్తల్ మీదుగా దేవరకద్రకు రానున్నారు. దీనికి గాను కార్యాచరణను రూపొందించడానికి కర్ణాటకలోని రాయచూర్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసిసి కార్యదర్శి బోసురాజుతో కలసి రేవంత్‌రెడ్డి, మాజీ యంపి మల్లు రవిలు కాంగ్రెస్ ముఖ్యనాయకులతో కలసి చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ టీపీసీసీ కార్యదర్శి జి.మధుసూధన్‌రెడ్డి(జియంఆర్), సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్‌లు కూడ పాల్గొన్నారు. తెలంగాణలో రాహుల్‌గాంధీ జోడోయాత్ర 13 రోజులపాటు కొనసాగనుంది. రోజుకు 31 కి.మి చొప్పున మొత్తం 360 కి.మి రాహుల్ గాంధీ జోడోయాత్ర జరుగనుంది. అందులో భాగంగానే జోడోయాత్ర తెలంగాణలో ప్రవేశించిన మరుసటిరోజే రాహుల్‌గాంధీ దేవరకద్రకు వచ్చేలా కాంగ్రెస్ నాయకులు రూట్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నారు. దేవరకద్ర నుండి మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, శంషాబాద్‌కు ఈ జోడోయాద్ర చేరుకొంటుంది. తెలంగాణలో జోడోయాత్ర చేయడానికి ఏఐసిసి నుండి ఆమోదం కూడ లభించిందని టీపీసీసీ కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి తెలిపారు.



కర్ణాటకలోని రాయచూర్‌లో ఏఐసిసి కార్యదర్శి బోసురాజుతో రూట్‌మ్యాప్‌కోసం చర్చిస్తున్న మధుసూధన్‌రెడ్డి

**-జోడోయాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న నేతలు..**

జోడోయాత్రలో భాగంగా రాహుల్‌గాంధీ దేవరకద్రకు వస్తున్న నేపథ్యంలో దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ కార్యదర్శి జి.మధుసూధన్‌రెడ్డి (జియంఆర్), సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొంటున్నారు. జోడోయాత్ర విజయవంతం చేయడానికి వారు త్వరలో దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని మండలాలల్లో పర్యటించే అవకాశం ఉంది. దీరికి గాను వారు ఓ కార్యచరణను సిద్దం చేస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను వారు కలువనున్నారు. రాహుల్‌గాంధీ జోడోయాత్రలో దేవరకద్రకు రావడం వారు తమ అదృష్టంగా భావిస్తున్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానం

**వెల్దండ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం బహుమతులను అందించారు. మొదటి విజేత జట్టుకు రూ.5116ల నగదుతో పాటు షీల్డ్, ద్వితీయ జట్టుకు రూ.3116లు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టు రూ.2116ల నగదుతో పాటు షీల్డ్‌లను ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌లు అందించారు. కార్యక్రమంలో పీఈటీలు పురంచంద్, శ్రీనివాసులు, వార్డు సభ్యులు వెంకటేష్, రమేష్, క్రీడాకారులు ప్రేమ్, సురేందర్, బాలకృష్ణ, సాయి, శ్రావణ్, సురేష్‌రెడ్డి, శివ, అనిల్ తదితరులు ఉన్నారు.



విజేతలకు బహుమతులను ప్రధానం చేస్తున్న దృశ్యం

## మోటర్ల దొంగతనాలకు పాల్పడిన నిందితులు అరెస్టు

### - 5 వ్యవసాయ మోటర్లు స్వాధీనం..

**రేవల్లి, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలో గత కొంతకాలంగా తలుపునూరు గ్రామ పరిధిలో వ్యవసాయ మోటర్లను దొంగలించిన నేరస్తులను మంగళవారం ఉదయం పక్కా సమాచారం పై వెహికల్ చెకింగ్ నిర్వహించి ఇద్దరి వ్యక్తులు కుబ్బిరెడ్డి అభిమన్యు రెడ్డి అరవింద్ రెడ్డి, కావలి వెంకటయ్య లను అదుపులోకి తీసుకొని విచారించగా వారితో పాటు వడ్డె నరసింహ, వట్టెం నరసింహ, తెప్ప ఆశన్న అందరి గ్రామం తల్పనూర్ గ్రామస్తులు కలిసి వారి గ్రామ శివారులోని వ్యవసాయ పొలాలలో బిగించిన వ్యవసాయ మోటర్లను ఎవరు లేని సమయంలో దొంగలించి పక్క గ్రామాలలో తక్కువ ధరకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారమని తెలపగా రేవల్లి ఎస్ఐ మల్లేష్ వారి సిబ్బంది 5 వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి వారి నుండి 5వ్యవసాయ మోటర్లను స్వాదీనం చేసుకోవడం జరిగింది. ఇందులో మొదటి వారైనా అభిమన్యు రెడ్డి గతంలో కూడా గోపాల్‌పేట, కోడేరు, నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్ లలో దొంగతనం కేసులు అయ్యి జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిసింది. ఈ 5నిందితులను చాకచక్యంగా పట్టుకొని వారి నుండి వ్యవసాయ మోటర్లను స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందిని వనపర్తి జిల్లా ఎస్పీ కె.అపూర్వరావు అభినందించారు. ఈ ఐదుగురు నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు పంపినట్లు ఎస్ కె.మల్లేష్ తెలిపారు.




నిందితులను పోలీస్ స్టేషన్‌లో హాజరువరిచిన పోలీసులు

## ఘనంగా విజయ దశమి వేడుకలు..

**ఖిల్లాఘనపురం, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అన్నీ గ్రామాలతో పాటు మండల కేంద్రంలో విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని కుమ్మరిగేరి ఆంజనేయస్వామి ఆలయం పూలతో సర్వంగా సుందరంగా అలంకరించి విజయదశమి పర్వదినాన్న ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో రావణుడి ప్రతిమ ను భారీ ఎత్తుగా గ్రామానికి చెందిన కుమ్మరి గేరి వాసులు ఏర్పాటు చేశారు. ఆలయం ఆవరణలో టపాయాకల శబ్దాల మధ్య విద్యుత్ కాంతులు వెదజల్లుతూ ఉండగా భక్తుల హర్షధ్వనాల మధ్య రావణాసురిడి దహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశమై జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించి జమ్మి పత్రాలను పంచుకున్నారు. యువకులు, మహిళలు అలాయిబలాయి చేస్తు ఒకరికి ఒకరు క్షమిపత్రాలను బహుకరించారు. గ్రామాల్లో మహిళలు పెద్దలు ప్రత్యే అలంకరణలతో ఆకర్షణీయంగా ముస్తాబైయ్యారు. మండల కేంద్రంలో సర్పంచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో రావణాసుర దహన వేడుకలను కన్నులపండుగగా నిర్వహించారు.



దహనానికి సిద్ధంగా ఉన్న రావణాసురిడి ప్రతిమ

## ఘనంగా టీఆర్ఎస్ నేత కుర్వశ్రీను జన్మదినవేడుకలు

**దేవరకద్ర రూరల్, అక్టోబరు 06 ప్రభాతవార్త:** దేవరకద్రలో బుధవారం రాత్రి యంపీటీసీ నిర్మల భర్త,మండల టీఆర్ఎస్ నాయకుడు కుర్వ శ్రీను జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోస్టాఫీస్ సమీపంలో జరిగిన ఈ వేడుకలో కేక్ కట్‌చేసి సంబరాలను జరుపుకొన్నారు. స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్య క్రమంలో టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి,నాయకులు కొండ భాస్కర్‌రెడ్డి, దొబ్బలి అంజనేయులు, రాధాకృష్ణ,యూత్‌నాయకులు సయ్యద్‌జకీ, యుగేందర్‌రెడ్డి, చల్మారెడ్డి, హన్మిరెడ్డి, అరుణ్, బాల్‌రాజ్, రఘు, మహేశ్, కొండల్, శ్యాం, విజయ్, సాయి, బాల్‌రాజ్, కుర్వసంఘం నాయకులు కేవిరాజు, రాంపండులతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



దేవరకద్రలో కేక్‌కట్‌చేస్తున్న శ్రీను

## దేశ రాజకీయాల్లో కెసిఆర్ రాణించాలి

### - లింగాల జడ్పీటిసి నేజమ్మ



**లింగాల, అక్టోబరు 06 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజా శ్రేయస్సు కోసం సీఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరు దేశ వ్యాప్తంగా ఆదరణ పొందడం, దేశ ప్రజలను ఆకర్షించే నాయకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని లింగాల జడ్పీటిసి సభ్యురాలు నేజమ్మ అన్నారు. బుధవారం టిఆర్ఎస్ పార్టీని జాతీయ బిఆర్ఎస్ పార్టీగా ప్రకటించిన సందర్భంగా ఆమె హర్షం వ్యక్తం చేశారు. గురువార ం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ రాజకీయాలలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టనున్న కెసిఆర్‌కు దేశ ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. అన్ని వర్గాల వారికి అండగా ఉంటూ ప్రజాదరణ పొందిన ఉత్తమ నాయకుడికి అన్ని రాష్ట్రాల ప్రజల మద్దతు లభించి కేంద్ర ప్రభుత్వాన్ని నడిపించగలిగే సత్తా ఉన్న నాయకులు అని అభివర్ణించారు. సర్వోన్నత పదవికి పట్టం కట్టాలని దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు కూడా చేశామన్నారు. ప్రపంచ దేశాలు సైతం తెలంగాణవైపు మొగ్గు చూపిన విధంగా భావితరాల బంగారు భవిష్యత్తుకు కెసిఆర్ దేశ రాజకీయాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు.

## దేశ అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

### -రాజాపూర్ టిఆర్ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షులు బంగారి వెంకటేష్



**రాజాపూర్,అక్టోబరు 06 ప్రభాతవార్త :** భారతదేశం అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరు దేశ రాజకీయాల్లో కెసిఆర్‌ను ఆహ్వానిస్తున్నారని దసరా పండగ రోజున భారతీయ రాష్ట్ర సమితి జాతీయ పార్టీకి శ్రీకారం చుట్టి దేశ రాజకీయాల్లోకి అడుగు పెట్టిన కెసిఆర్ జడ్చర్ల ఎమ్మెల్యే డా. చర్లకోళ్ల లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టిఆర్ఎస్ యూత్‌వింగ్ మండల అధ్యక్షులు బంగారు వెంకటేష్ పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ తెలంగాణ రాష్ట్రంలోని పథకాలు దేశమంతా అమలు చేయాలని దేశ రైతాంగం ప్రజలు కోరుకుంటున్నారని రాజాపూర్ మండల యూత్‌వింగ్ అధ్యక్షులు బంగారి వెంకటేష్ పేర్కొన్నారు. ప్రస్తుత జాతీయ పార్టీలపై దేశ ప్రజలు నమ్మకం కోల్పోయారని దేశమంతా కెసిఆర్ పాలన కోరుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ పార్టీ స్థాపించిన కెసిఆర్ ఆలోచన విధి విధానాలను తప్పకుండా అమలు కావాలని కోరుకుంటున్నట్లు రాజాపూర్ టిఆర్ఎస్ పార్టీ యూత్‌వింగ్ అధ్యక్షులు బంగారి వెంకటేష్ పేర్కొన్నారు.

# దేశంలో ప్రభంజనం సృష్టించనున్న బీఆర్ఎస్ జాతీయపార్టీ

### - టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి

**దేవరకద్ర రూరల్,అక్టోబరు 06 ప్రభాతవార్త:** భారతదేశంలో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పెట్టే జాతీయ బీఆర్ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి బీఆర్ఎస్(భారత్ రాష్ట్ర సమితి) జాతీయ పార్టీని ప్రకటించినందున దేవరకద్రలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండల టీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండు వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు స్వీట్లు తినిపించుకొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జెట్టినరసింహ్మారెడ్డి ప్రజంగించారు. ఇక మీదట రాష్ట్రంలోనే గాక ఇతర రాష్ట్రాలలో కూడ కేసీఆర్ పాగ వేయబోతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పటుతో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోనే దేశం ముందు భవిష్యత్తులో అభివృద్ధి పథం వైపు నడవడానికి అస్కారమేర్పడుతుందన్నారు. దీనికి గాను ఇతర రాష్ట్రాలలో మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ భాస్కర్‌రెడ్డి, ఉప్పరి సత్యం, దొబ్బలి అంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాల్‌రాజ్, వెంకటేష్, వెంకట్రాములు, మెడికల్ షాపు రాము, హన్మిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్‌పాషా, షరీఫ్, సయ్యద్‌గౌడ్, రాము, రాధాకృష్ణ, అంజనేయులు, బాలస్వామి, వెంకటేష్, యుగేందర్‌రెడ్డి, సాయికిరణ్, చల్మారెడ్డి, శ్రీకాంత్, జకీ, బైండ్ల రాములు, నాగేశ్, బీసు శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు సోషల్ మీడియా కన్వీనర్ భార్గవచారి తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో బాణాసంచా కాలుస్తున్న టీఆర్ఎస్ నాయకులు

## ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు

**వెల్దండ, అక్టోబర్ 06, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి 9 రోజుల పాటు అమ్మవారిని వివిధ అలంకరణలో అలంకరించి నిత్య పూజలు నిర్వహించారు. వెల్దండ మండల కేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రతిష్టించిన అమ్మవారి వద్ద ఉత్సవ కమిటీ అధ్యక్షులు పూరి రమేష్ దంపతులు హోమ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరు యాంత్రీక జీవితానికి అలవాటు పడి దైవ మార్గానికి దూరమవుతున్నారని, ప్రతి ఒక్కరు దైవమార్గాన్ని అనుసరిస్తే కుటుంబంలో, సమాజంలో సుఖ శాంతులు విరజిల్లుతాయన్నారు. అమ్మవారిని భక్తితో పూజించి కొలిస్తే ఆ ఇంట్లో సుఖ శాంతులతో పాటు అష్టయిష్వర్యాలు సమకూరుతాయని ఆయన పేర్కొన్నారు. సుఖమయమైన జీవితాన్ని మానవులు అలవర్చుకోవాలని, అలాంటి జీవితం ఒక్క అధ్యాత్మిక శక్తి ద్వారానే లభిస్తోందన్నారు. పాండురంగనాయక దేవాలయంలో ప్రతిష్టించిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి శోభయాత్ర నిర్వహించి శోభయాత్రలో మహిళలు కోలాటాలు వేస్తూ కోలాహాలంగా సందడి చేస్తూ నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో పీఆర్ఓ మిర్యాల రాజయ్య, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, శశిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జంగాచారి, శ్రీనివాసులు, రాజేష్, వీరారెడ్డి, రాజు, సుధాకర్‌రెడ్డి, పాండుచారి, రంగారావు, కిషన్‌రావు, అరుణమ్మ, విజయమ్మ, అంజనమ్మ, దివ్య, రమ్య, చిన్న, లక్ష్మమ్మ, సరస్వతి తదితరులు ఉన్నారు.



పాండురంగనాయక స్వామి దేవాలయ అమ్మవారి నిమజ్జన శోభయాత్ర

## భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **వర్షాల వల్ల ఎలాంటి ప్రమాదం ఎదురైన ఎదుర్కొనేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉంది**
- **వర్షాల కారణంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు**
- **వర్షాలవల్ల ప్రమాదం పొంచి ఉంటే వెంటనే 100డయల్ కు ఫోన్ చేసి పోలీసుల తక్షణ సహాయం పొందండి**
- **రాబోయే 3రోజులు అతిభారీ వర్షాలు వాతావరణశాఖ హెచ్చరిక**
- **వనపర్తి జిల్లా డీఎస్పీ ఆనంద్ రెడ్డి**



**వనపర్తి క్రైమ్,అక్టోబర్ 06 ప్రభాతవార్త:** జిల్లాలో 2రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమైత్తమై లోతట్టు ప్రాంతాలను, ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను తనిఖీ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ చర్యలను చేపట్టాలని వనపర్తి డీఎస్పీ ఆనందర్ రెడ్డి జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇంకా 3రోజుల పాటు అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మట్టి మిద్దెలు, ప్రమాదకరంగా ఉండే పురాతన ఇండ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలలో ఉండాలని ఇందుకోసం సంబంధిత గ్రామాలలోని గ్రామపంచాయితీ సిబ్బంది, స్థానిక యువత అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు లేదా పాఠశాల భవనాలను పరిస్థితులు మెరుగు పడేవరకు సహాయక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తునం దున్న గ్రామాలలో పాత ఇండ్లు, గుడిసెలలో శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉండే ప్రజలు అప్రమత్తం ఉండాలని, అలాగే నది తీరా గ్రామాలలో పెద్దలు తమ పిల్లలను నదుల్లోకి వెళ్లకుండా చూడాలని, వాగులు వంకలలో కూడా నీటి ప్రవాహం వచ్చే అవకాశాలు ఉన్నందున ఆయా ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని, వర్షాల దృష్ట్యా పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి ప్రమాదం ఎదురైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న కుంటలు, చెరువుల దగ్గర ప్రదాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం తెలుసుకొని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, అలాగే స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయితీ, విద్యుత్, ఆర్‌ఆర్, వైద్యశాఖ, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వర్షాల వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలను జాగృతం చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్లపై వరద ఉదృతితో రోడ్లు తెగిపోయిన, ఉదృతంగా ప్రవహించి అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్, హెచ్చరిక గల ప్లెక్సీలు ఏర్పాటు చేసి సంబంధిత గ్రామ సర్పంచ్ లను, ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులతో ఎప్పటికప్పుడు వరద ఉదృతి గురించి అడిగి తెలుసుకొని ప్రమాద నివారణ చర్యలను చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని గ్రామ పోలీసు అధికారులకు సూచించారు. వరద ఉదృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉన్న ప్రదేశాలలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని పోలీసు అధికారులను, సిబ్బందిని సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే జిల్లా పోలీసు వాట్సప్ నెంబర్ 63039223200 పోలీసు కంట్రోల్ రూమ్, 08545-223331 గాని, డయల్ 100 కు ఫోన్ చేసి గానీ దగ్గర్లోనీ పోలీసు స్టేషన్ కు గానీ సమాచారం అందించి వెంటనే పోలీసు వారి సహాయం పొందాలని జిల్లా ప్రజలను డీఎస్పీ కోరారు.

## విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా

**పాన్‌గల్, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కేతెపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు సీపీఐ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ మాట్లాడు తూ పేదలు, రైతాంగానికి కీడు చేసే విద్యుత్ ప్రైవేకరణను ప్రతిఘటించి పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రం తెచ్చిన సాగు చట్టాల పై వెనక్కి తగ్గేదాకా పోరాడిన రైతాంగం స్పూర్తి కావాలన్నారు. ప్రభుత్వ రంగంలోని ట్రాన్స్కో ఆస్థులను అమ్ముకొని రాష్ట్రాలు సొమ్ము చేసుకోవాలని మంగళవారం కేంద్రం రాష్ట్రానికి లేఖ రాయడం పై ఆయన స్పందించారు. విద్యుత్ ప్రైవేకరణ చట్ట సవరణ ముసాయిదా బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపిన కేంద్రం, బిల్లులోని అంశాలను, దొడ్డిదారిన రోజుకు ఒక ఉత్తర్వు ద్వారా అమలుకు ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఆదాని, అంబానీ లాంటి కార్పోరేట్లకు, ఇతర ప్రైవేట్ సంస్థలకు విద్యుత్ ను కట్టబెట్టి పేదలు, రైతులను దోచుకునేందుకు అనుమతి ఇవ్వటమేనన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా తెగించి పోరాడక తప్పదని ఆయన అన్నారు. తెల్లరాళ్లపల్లి ఉపసర్పంచ్ కాకం బాలస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్, సీపీఐ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, తెల్లపాళ్లపల్లి శాఖ కార్యదర్శి సహదేవ్, సీనియర్ నాయకులు చిన్న కురుమయ్య, మాల కురుమయ్య, కురువ హనుమంతు, కాకం చిన్న నారాయణ, హేస్సేన్, మద్దిలేటి పాల్గొన్నారు.



కెతెపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపడుతున్న సీపీఐ నాయకులు

## మత్తడి దూకిన చెరువులు..

**ఖిల్లాఘణపురం, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలో గత 2రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు మత్తడి దూకడంతో పాటు పొండిపొర్లుతున్న వాగులన వలన గ్రామాల మధ్య రవాణా వ్యవస్థా రాకపోకలు బంద్ అయ్యాయి. మండల కేంద్రం నుండి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారిలో రైస్‌మిల్ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పూర్తి కాకపోవడంతో తాత్కాలికంగా వేసిన బ్రిడ్జిపై నుండి వరద నీరు భారీ పారుతుండడంతో జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అప్పారెడ్డిపల్లి, సల్కలాపూర్ మధ్య, మామిడిమాడ, సల్కలాపూర్ మధ్య, వెనికి తాండ, బక్క తాండ మధ్య, వేంకటంమంపల్లి, కమలోద్దీన్‌పూర్ మధ్య భారీ వర్షానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులపాలు అయ్యారు. వాగులు ఒక్కసారిగా ఉప్పొంగి పారడంతో ద్విచక్రవాహన దారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురైయ్యాయి. మండల పరిధిలోని శాపూర్, దొంతికుంటతాండ, రుక్కనపల్లి, అప్పారెడ్డిపల్లి, ఆగారం గ్రామాలలోని చెరువులు మత్తడి దూకడంతో ఆయా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేవారు. దొంతికుంట తాండా చెరువు 10సంవత్సరాల అనంతరం నేడు మత్తడి దూకిందని సర్పంచ్ పీనా నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. శాపూర్ చెరువు మత్తడి దూకడంతో సర్పంచ్ బాలాంజనేయులు గౌడ్ వరద నీటికి ప్రత్యేక పూజలు చేశారు.రైతులు చెరువులు మత్తడి దూకడంతో పంట సాగు కు సన్నద్ధమైయ్యారు.



మత్తడి దూకుతున్న శాపూర్ చెరువు కు పూజలు చేస్తున్న సర్పంచ్

## రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికిన వర్కూర్ కాంగ్రెస్ శ్రేణులు

**మక్తల్,అక్టోబరు 06 ప్రభాతవార్త :** భారత్‌జోడా యాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించడానికి వస్తున్న పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికేందుకు మాగనూరు మండల వర్కూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున మాగనూరు మండలం దగ్గర స్వాగత ఏర్పాట్లు చేసి స్వాగతం పలికారు. వర్కూర్ గ్రామ ఉపసర్పంచ్ పోర్ల కృష్ణయ్య, వార్డు మెంబర్లు రాము, నరసింహతో పాటు గ్రామ అధ్యక్షుడు మొగులప్ప, భీమప్ప, బుజ్జప్ప, ఒబాయ రవితో పాటు గ్రామం నుండి దాదాపు 100 మంది కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.



రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

## భక్తి శ్రద్ధలతో విజయదశమి వేడుకలు

**వెల్దండ, అక్టోబర్ 06, ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో విజయ దశమి పర్వదిన వేడుకలను ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో దసరా ఉత్సవ వేడుకలకు ప్రతి ఒక్కరు నూతన దుస్తులు దరించి షమీ వృక్షానికి సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఎస్ఐ నర్సింహ్మలు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలు ఆడి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామస్తులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు గావించారు. ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శశిపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, యెన్నం కృష్ణారెడ్డి, శశిపాల్‌రెడ్డి, క్యాసారపు వెంకటయ్య, భయ్య మల్లయ్య, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, ఆంజనేయులు, ప్రభాకర్, ప్రసాద్, కాదూరాం, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్

## ఘనంగా దుర్గామాత నిమజ్జనం

**పాన్‌గల్, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో దుర్గామాత నిమజ్జనం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి దగ్గర శరన్నవారాత్రి ఉత్సవాల్లో భాగంఆ 11 రోజుల పాటు పూజలు చేపట్టిన దుర్గామాతకు గ్రామ శివారులోని పోలికి చెరువులో వందలాది మంది భక్తుల మధ్య నిమజ్జనం చేశారు. అంతకుముందు పెద్దమ్మ గుడి నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా దుర్గామాత శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్ర ను పురస్కరించుకొని నందికోళ్ల సూవ చేపట్టారు. మహిళలు బొడ్డెమ్మలు, కోలాటాలు వేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ పాన్‌గల్ గ్రామంలో గతంలో ఎన్నడు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు చేపట్టలేదని ఈ ఏడాది మొదటిసారిగా చేపట్టిన ఉత్సవాలకు భక్తుల నుంచి మంచి స్పందన లభించిదని ఇకమీదట ప్రతి ఏడాది పెద్దమ్మ గుడి దగ్గర దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండల కేంద్రంలో దుర్గాదేవి శోభయాత్ర

## నేడు గట్టుకాడిపల్లికి మంత్రి రాక..

**ఖిల్లాఘనపురం, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గట్టుకాడిపల్లి గ్రామంలో పల్లెనిద్ర చేయడానికి శుక్రవారం సాయంత్రం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి రానున్నట్లు మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని కార్యకర్తలకు గట్టుకాడిపల్లి గ్రామంలో మంత్రి సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి పాల్గొనే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. టీఆర్ఎస్ కార్యకర్తలు సకాలంలో సమావేశానికి రావాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

**వెల్దండ, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటి పరిధిలోని చింతలపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బావబామ్మర్ది మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన కోడేల రామకృష్ణ, మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన కడారి మల్లేష్‌లు బావబామ్మర్దులు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని బావ మల్లేష్‌తో కలిసి బామ్మర్ది రామకృష్ణలు ద్విచక్రవాహనంపై తన అత్తగారు ఊరైన కేశంపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆమనగల్లు మున్సిపల్ చింతలపల్లి వద్ద కారు బలంగా ఢీకొనడంతో ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. గురువారం మృతుల కుటుంబ సభ్యుల అంత్యక్రియలు నిర్వహించారు. బావబామ్మర్దులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాదాలు నెలకొన్నాయి. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ భీరయ్య, ఉప సర్పంచ్ నర్సింహ్మలు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సంతాపం తెలిపారు.



కోడేల రామకృష్ణ (ఫైల్)

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

**రేవల్లి, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శానాయిపల్లి గ్రామ బస్టాండ్ సమీపంలో గల పెట్రోల్ బంక్ దగ్గర బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి ఈ ప్రమాదంలో గౌరిదేవిపల్లి గ్రామానికి చెందిన పాలమోని మల్లయ్య(మల్లేష్) అనే వ్యక్తి నాగర్‌కర్నూల్ నుంచి పనులు ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా నాగనులు గ్రామానికి చెందిన రమేష్, సురేష్ అనే వ్యక్తులు కొత్త బండరావిపాకుల గ్రామం నుంచి వారి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వెళ్లి ఢీ కొనడంతో సమీపంలో ఉన్న వ్యక్తులు క్షతగాత్రులను వెంటనే అంబులెన్సు ద్వారా నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. కానీ పాలమోని మల్లయ్య అనే వ్యక్తి మార్గమధ్య లోనే మరణించడం జరిగిందని మిగతా ఇద్దరు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో ఉన్నారు అని రేవల్లి ఎస్ఐ మల్లేష్ తెలిపారు. మృతునికి భార్య పద్మ, ఇద్దరు చిన్న పిల్లలుఉన్నారని,వారినిప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



మల్లేష్ (ఫైల్‌ఫోటో)

## అప్రమత్తంగా ఉండండి -మున్సిపల్ ఛైర్మన్ బస్వరాజ్‌గౌడ్



**భూత్పూర్,అక్టోబరు 06 ప్రభాతవార్త :** గడిచిన రెండు రోజులుగా భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు, పాత ఇళ్ల, మిద్దెలలో నివాసముండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ కోరారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు ఎల్లవేళలా ఆదుకునేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు.

## టిఆర్ఎస్ జాతీయ పార్టీ బిఆర్ఎస్‌గా మారడం శుభ పరిణామం

### - టిఆర్ఎస్ ప్రకటనతో లింగాలలో సంబురాలు

**లింగాల, అక్టోబరు 06 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కెసిఆర్ టిఆర్ఎస్ పార్టీని జాతీయ పార్టీగా బిఆర్ఎస్ (జాతీయ పార్టీ భారత రాష్ట్ర సమితి)గా మార్చుతూ ప్రకటన చేయ డంతో బుధవారం బిఆర్ఎస్ శ్రేణులు మండ లంలోని వివిధ గ్రామాలలో సంబరా లు జరుపుకున్నారు. ఈసంద ర్భంగా మండల కేంద్రమైన



సంబరాలు చేసుకుంటున్న బిఆర్ఎస్ శ్రేణులు

లింగాలలో బాణాసంచా కాల్చి, మిఠాయిలను పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. కెసిఆర్ నేతృత్వంలో ఉద్యమ పార్టీగా టిఆర్ఎస్ అవతరించి ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కోసం టిఆర్ఎస్ ప్రాంతీయ పార్టీగా రూపాంతరం చెందిందని, నేడు దేశ రాజకీయాల్లో అడుగుపెట్టడం శుభ పరిణామమని పలువురు నాయకులు అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేసిన ఘనత కెసిఆర్ ప్రభుత్వానికి దక్కిందని, వాటిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆకాంక్ష జాతీయ పార్టీ బిఆర్ఎస్ ద్వారా నెరవేరబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ హనుమంతురెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు రవిశంకర్, సర్పంచ్ కోనేటి తిరుపతయ్య, రానోజీ, జెసిబి శ్రీనివాసులు, రామకృష్ణ, మల్లేష్, బళ్లారి నాగేశ్వర్, అజీమ్, మైబు, ప్రణయ్, పోల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సర్వాయిపాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలి...

### - మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

**కల్వకుర్తి, అక్టోబర్ 06, ప్రభాతవార్త:** సాయుధ తెలంగాణ పోరాట యోధుడు సర్వాయిపాప న్నగౌడ్ ఆశయాలను కొనసాగిం చాలని మాజీ మంత్రి చిత్తరంజ న్‌దాస్ అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన సర్వా యి పాపన్నగౌడ్ విగ్రహావిష్కర ణ కార్యక్రమానికి మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జిల్లా జెడ్పీవైస్ ఛైర్మ న్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు వెంకటయ్యగౌడ్‌లు



సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం

హాజరై విగ్రహావి ష్కరణ గావించారు. పలువురు మాట్లాడుతూ రజాకారుల పాలనలో తెలంగాణ ప్రజలు దోపిడి, అరాచాకాలకు గురి చేస్తూ రజాకారులు నానా హింసలు పెట్టిన సమయంలో సర్వాయిపాపన్నగౌడ్ తెలంగాణ ప్రజలను కాపాడుకునేందుకు ఉద్యమ సారథిగా ఉండి తెలంగాణ ప్రజలను కాపాడిన ఘనత సర్వాయి పాపన్నకే దక్కిందని వారుపేర్కొన్నారు. పాపన్నగౌడ్ కేవలం ఒక గౌడ కులానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అన్ని వర్గాలకు సంబంధించిన వ్యక్తి అని అన్నారు. గోల్కొండ నుంచి ఢిల్లీ కోట వరకు అద్భుత విజయాన్ని సాధించి చరిత్రలో ఒక గొప్ప వీరుడిగా నిలిచారని వారు కొనియాడారు. ఆయన వీరత్వం అందరికి ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్‌గౌడ్, సుద్దపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రాకేష్‌కుమార్, కృష్ణగౌడ్, మాజీ జెడ్పీటీసీ బాలస్వామిగౌడ్, నాయకులు సదానందంగౌడ్, రవికుమార్‌గౌడ్, భూపాల్, రమేష్, కృష్ణయ్య, మట్ట నాగయ్యగౌడ్, మట్ట రాజు, రమేష్, స్వామి, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

## వర్షాలకు జగత్పల్లి-వనపర్తి మధ్య నిలిచిపోయిన రాకపోకలు

### - 5 గ్రామాల ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు..

**పెద్దమందడి,అక్టోబర్ 06 ప్రభాతవార్త:** బుధవారం రాత్రి కురిసిన బారీ వర్షాలకు వరద నీరు ఒక్కసారిగా పెద్దఎత్తున రావడంతో రాజనగరం అమ్మచెరువు అలుగు పారి జగత్పల్లి చెరువు అయిన జక్‌పాల్ సముద్రానికి వరద ఉధృతి పెరగడంతో జగత్పల్లి బ్రిడ్జి పై నీటి ప్రవాహం పెరిగింది. దీంతో జగత్పల్లి గ్రామ స్థులు ముందు జాగ్రత్త



జగత్పల్లి చెరువు బ్రిడ్జి పై ప్రవహిస్తున్న వరద నీరు

చర్యగా ఎవరూ కూడా బ్రిడ్జి పై ప్రయాణించకుండా కంచె వేశారు. దీంతో అల్వాల, పెద్దమందడి, మనిగిల్ల, జగత్పల్లి, అచ్యుతాపురం గ్రామాల నుండి వనపర్తి కి వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసరం ఉన్న ప్రజలు అచ్యుతాపురం, చిట్యాల మీదుగా వనపర్తి కి వచ్చారు. వరద ఉధృతి గురువారం సాయంత్రానికి కూడా అలాగే ఉండడంతో రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది.

## అలుగు పారుతున్న భూత్పూర్ మొగుళ్ల చెరువు

**భూత్పూర్, అక్టోబరు 06 ప్రభాతవార్త :** గడిచిన మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భూత్పూ ర్ చెరువులు ఊరగుంట, కథాల్ఖాన్ చెరువులు నిండి అలుగులు పారగా పెద్దచెరువు మొగుళ్లచెరువు గురువారం నిండి అలుగు పారింది. జిల్లా మత్స్య సహకార సంఘం ఇంఛార్జి పర్సన్ మానెమోని సత్యనారాయణతోపాటు నాయకులు, మత్స్య కారులు ఇక్కడికి చేరుకుని గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అలుగు పారుతున్న మొగుళ్ల చెరువు

## పార్వతీపరమేశ్వరుల కళ్యాణం..

**గోపాల్‌పేట, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలంలో బుధవారం దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని ఈశ్వరస్వామి దేవాలయం లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరిం చుకొని పండుగ రోజు పార్వతీపర మేశ్వరుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అదే విధంగా చెన్నకేశవ ఆలయం దగ్గర ప్రతిష్టించి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా వెళ్లి బుద్దారం గండి దగ్గర ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని బుద్దారం, పొల్కెపాడు గ్రామలలో ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



పార్వతీపరమేశ్వరుల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

## పట్టణంలో పర్యటించిన మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్, వైస్ ఛైర్మెన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్,అక్టోబర్ 06 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో రాత్రి కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్, వైస్ ఛైర్మెన్ వాకిటి శ్రీధర్ పరిశీలిం చారు. రాత్రి కురిసిన భారీ వర్షంతో గోపాల్‌పేట జెర్రిపోతుల వాగు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడం జరిగింది. విపరీతంగా వాగు పారడడంతో అక్కడికి వెళ్లి వాహనదారులను,



జెర్రిపోతుల మైసమ్మ దగ్గర తెగిపోయిన తాత్కాలిక రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్, వైస్ ఛైర్మెన్ వాకిటి శ్రీధర్

పాదాచారులను దారి మళ్లించారు. కాంట్రాక్టర్ ను వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని రాకపోకలకు ఇబ్బంది కలగకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా తాళ్లచెరువు వాగును పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆతర ప్రాంతాలకు రాకపోకలను రెండు, మూడు రోజులు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఈనెల 8,9న జరిగే (పిడబ్ల్యుఓ) రాష్ట్ర ఏడవ మహాసభలను జయప్రదం చేయండి

**చిన్నచింతకుంట, అక్టోబరు 06 ప్రభాతవార్త :** మహిళలపై జరుగుతున్న దాడులను స్త్రీ, పురుష సమానత్వంకై పోరాడాలని అక్టోబర్ 8,9 తేదీలలో నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పిడబ్ల్యు) రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని పిఓడబ్ల్యు నాయకురాలు కోళ్ల నాగమ్మ పిలుపునిచ్చారు. గురువారం చిన్నచింతకుంట మండలం పర్దీపూర్ గ్రామంలో మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు అమలులో ఉన్న



మహాసభలో గోడపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

పితృస్వామిక కుటుంబ వ్యవస్థలో పురుషుడు యజమాని కాగా స్త్రీ పరాదీనగా ఉంది. పరస్పర ప్రేమ, ఇష్టం, అంగీకారంగా, కులమతాలు, డబ్బు, హోదా, బంధుత్వం మొదలైన అంశాలపై ఆధారపడి వివాహ వ్యవస్థ వలన స్త్రీల హక్కులు హరించబడుతున్నాయన్నారు. స్త్రీలపై వివక్ష, అణిచివేత, పెత్తనం, పురుషాధిక్యత లాంటి అనేక సమస్యలతో స్త్రీలు సతమతమవుతున్నారన్నారు. కుటుంబంలో ఆస్తులపై ఆధిపత్యం పురుషునిదే, స్త్రీల కర్తవ్యం వారసులను కనడం, కుటుంబానికి చాకిరీ చేయడం మాత్రమే అయిపోయింది. ఈ దేశంలో మతాలన్ని స్త్రీలను అబలగా, పరాదీనగా చిత్రీకరించాయి. సహనం, క్షమాగుణం, నమ్రత, సిగ్గు వంటి అనేక లక్షణాలకు ప్రతీకగా స్త్రీని చెబుతున్నాయి. దీనిలో భాగంగానే స్త్రీలపై సతీసహగమనం, కన్యాశుల్కం, బాల్య వివాహాలు, పునర్వివాహ నిరాకరణ, బసివిని, జోగిని, దేవదాసి లాంటి దుర్మార్గమైన దురాచారాలకు ఎందరో స్త్రీలు బలైపోయారు. రాజారామ్మోహన్‌రాయ్, విద్యాసాగర్, దయానంద సరస్వతి, కందుకూరి వీరేశలింగం, గురజాడ, పూలె వంటి వాళ్లు ఎందరో సంఘ సంస్కర్తలు ఈ దురాచారాలకు వ్యతిరేకంగా గళం విప్పారని అన్నారు. నేడు విద్యలోనూ, ఉద్యోగాలలోనూ, బాధ్యతల నిర్వహణలోనూ పురుషులతో పోటీ పడుతున్న స్త్రీని ఇంకా పితృస్వామిక భావాజాలం వెన్నాడుతూనే ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీలపై అత్యాచారాలు ప్రమాదకర స్థాయిలో పెరిగాయని, కతువా లాంటి ఘటనలు అనేకంగా జరిగాయి, జరుగుతున్నాయన్నారు. పసిపిల్లల నుండి పండు ముసలి వరకు అత్యాచారాలు జరుగుతున్నాయని, భేటీ పడావో- భేటీ బచావో అనేది నినాదంగానే మిగిలిపోయిందని, మహిళలకు రక్షణ కరువైందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం తీరు కూడా అలాగే ఉందని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో మహిళల కేటాయింపులు తగ్గిపోతున్నాయన్నారు. కళ్యాణలక్ష్మి, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, ప్రసవ మహిళలకు కెసిఆర్ కిట్లు సరిగా అమలు కావడం లేదన్నారు. ఆకర్షణీయ పథకాలతో మహిళా ఓటర్లకు గాలం వేయడం కోసమే తప్ప మరోటి లేదన్నారు. సమాజంలో ఉన్న రుగ్మతలు, ఆధిపత్య ధోరణి విడనాడాలని, స్త్రీలపై జరుగుతున్న లైంగిక దాడులను, హత్యలను, వేధింపులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా అక్టోబర్ 8,9 తేదీలలో పిఓడబ్ల్యు 7వ మహాసభలను నారాయణపేట జిల్లా కేంద్రంలో జరుపుతుందన్నారు. ఈ సభలకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యు నాయకులు సాయమ్మ, కోళ్ల జయమ్మ, చంద్రకళ, చంద్రమ్మ, లక్ష్మమ్మ, మంగమ్మ, వెంకటమ్మ, రేణమ్మ, జయమ్మలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, బేడ బుడగ జంగాల కుటుంబాలకు దళితబంధు పథకం ఇవ్వాలి

**పెంట్లవెల్లి, అక్టోబరు 06 ప్రభాతవార్త :** బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి (బిజెహెచ్‌పిఎస్) మండల కమిటి ఆధ్వర్యంలో గురువారం పెంట్లవెల్లి మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో బేడ, బుడగ జంగాల కాలనీలో బోర్డు ఆవిష్కరణ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ బోర్డు ఆవిష్కరణ సదస్సుకు సభాధ్యక్షత ఎడవల్లి వీరప్ప రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు సభాధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవస్థాపక అధ్యక్షులు సిరిగిరి మన్యం, రాష్ట్ర అధ్యక్షులు కొడగంటి నరసింహులు హాజరయ్యారు. ఈసందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు సిరిగిరి మన్యం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర ం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా డా.బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీ 59 కులాల్లో బేడ బుడగ జంగం కులం వారికి ఒకటి రాజ్యాంగం ప్రకారం వచ్చే హక్కులు, రిజర్వేషన్లు ఇప్పటివరకు అందలేదని టిఆర్ఎస్ ప్రభుత ్వం ఏర్పాటై ఎనిమిద సంవత్సరాలు గడుస్తున్నా ఎస్సీ కార్పోరేషన్‌లో డబుల్ బెడ్‌రూం సంక్షేమ పథకాలు అందలేదని అందుకే



పార్టీ బోర్డు ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వం ఎస్సీలకు దళితబంధు పథకం పెట్టిందన్నారు. ఎస్సీ బేడ, బుడగ జంగాల ప్రతి కుటుబానికి దళితబంధు పథకం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాక అధ్యక్షులు సిరిగిరి మదన్యం, రాష్ట్ర అధ్యక్షుడు కోడగంటి నరసింహా, పెంట్లవెల్లి మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, సంఘం నాయకులు వెంకట్రాముదు, చింతలయ్య, సుబ్బయ్య, సురేష్ పాల్గొన్నారు.

## భారత్‌మాల భూ బాధితుల ధర్నాను జయప్రదం చేయండి

### -జిల్లా కన్వీనర్, భూసంరక్షణ కమిటి జిల్లా కన్వీనర్ జి. వెంకట్‌రామ్‌రెడ్డి

**మక్తల్, అక్టోబరు 06 ప్రభాతవార్త :** భూ బాధితుల జనరల్ బాడీ సమావేశాలు కచ్వార్, జక్లేర్, గుడిగండ్ల, ఎలిగండ్ల గ్రామాలలో నిర్వహించారు. ఈ సమావేశాల్లో భూ సంరక్షణ కమిటి జిల్లా కన్వీనర్ జి. వెంకట్‌రామ్‌రెడ్డి, మక్తల్ ఏరియా కన్వీనర్ పి. ఆంజనేయులు, మక్తల్ మండల కన్వీనర్ గోవిందరాజులు పాల్గొని న్యాయమైన పరిహారం కొరకు రైతులు, బాధితులు నేడు జరిగే ధర్నాలో బాధితులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో భారత్‌మాల రోడ్డు 167 కొరకు 5 మండలాల్లో 19 గ్రామాల పరిధిలో 550 ఎకరాలు సేకరిస్తున్న సందర్భంగా భూములు, ప్లాట్లు, ఇతర నిర్మాణాలు కోల్పోతున్న వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని భూసేకరణ అధికారులు గతంలో ఉన్న బ్రిటిష్ చట్ట పద్దతులను పాటిస్తూ ఏకపక్షంగా ముందుకు వెళ్తున్నారన్నారు. అతి తక్కువ నష్టపరిహారం ప్రకటిస్తున్నారని ఎకరాకు 5-6.30 లక్షల వరకు, ప్లాట్లకు రూ. 1200-1800ల వరకు చెల్లిస్తామని అధికారులు ప్రకటిస్తున్నారని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు 80 లక్షల నుండి 1 కోటి 20 లక్షల వరకు,ప్లాట్లకు గజం ధర 30-40 వేల వరకు ధరలు ఉన్న ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే పరిహారం వాస్తవ ధరలకు 10 శాతం ఉందన్నారు. పరిహారం విషయంలో మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకుని అమలు చేయాలని కోరుతూ నేడు జరిగే ధర్నాలో భూ బాధితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వివిధ గ్రామాల్లో (కచ్వార్, జక్లేర్, ఎలిగండ్ల, గుడిగండ్ల, ఎమ్నోనిపల్లి)లో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో నిర్ణయించారు. ఈ జనరల్ బాడీ సమావేశం సందర్భంగా కాచువార్, దండు, జక్లేర్ గ్రామాల్లో భూ బాధితులతో కమిటీలను ఎన్నుకున్నారు. కాచువార్‌లో అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీశైలం, మధుసూదన్‌రెడ్డి లతో పాటు జక్లేర్‌లో గౌరవాధ్యక్షులుగా మాధవరావు, అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, భీమేష్‌లను, దండు గ్రామంలో అధ్యక్షులుగా శాంతిరెడ్డి, కార్యదర్శిగా రాఘవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాంరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## శ్రీ కురుమూర్తిస్వామి టెండర్లలో పారదర్శకత ఏది..?

### - బీఎస్పీ దేవరకద్ర నియోజకవర్గ ఇంఛార్జి బి. సంతోష్‌రెడ్డి

**చిన్నచింతకుంట, అక్టోబరు 06 ప్రభాతవార్త :** శ్రీ కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే టెండర్లలో పారదర్శకత లోపించిందని బీఎస్పీ దేవరకద్ర నియోజకవర్గ ఇంఛార్జి మద్దూరు బి. సంతోష్‌రెడ్డి అన్నారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే టెండర్లను దక్కించుకున్న వారినుండి పూర్తిస్థాయిలో నగదును కట్టించుకోవడంలో దేవాదాయశాఖ, ఆలయ కమిటి పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. టెండర్లు నిర్వహించే సమయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ రూపొందించిన నియమ నిబంధనల కరపత్రంలో సూచించిన ప్రకారం టెండర్ పొందిన వ్యక్తులు ఆచరించకుండా జాతర సమయంలో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి భక్తులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. టెండర్లను నిర్వహించే సమయంలో గతంలో టెండర్లను పొందిన వ్యక్తుల నుంచి పూర్తిగా నగదు చెల్లించిన వారికి మరల టెండర్లలో పాల్గొనే అవకాశం ఇవ్వాలి కానీ, బకాయిలు ఉన్నవారు మరల టెండర్లు యదేచ్ఛగా పాల్గొంటూ దేవాదాయ, ధర్మాదాయ శాఖను బురిడీ



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ దేవరకద్ర నియోజకవర్గ ఇంఛార్జి బి. సంతోష్‌రెడ్డి

కొట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టెండరు పొందిన వ్యక్తినుండి పూర్తిస్థాయిలో నగదును చెల్లించాలని వారం రోజుల ముందే నోటీసు బోర్డులో వేయాలన్నారు. టెండర్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని నోటీస్ బోర్డులో ఉంచాలని గతంలో టెండర్లను పొందిన వ్యక్తుల నుంచి పూర్తి స్థాయిలో నగదు చెల్లింపులు జరిగిన తరువాత రశీదులు పొందుపరిచి మళ్లీ టెండర్‌లో పాల్గొనడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. టెండర్‌దారుల వివరాలను కూడా నోటీసు బోర్డులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## విజయదశమి వేడుకల్లో ఎంపీ పోతుగంటి రాములు

**కల్వకుర్తి, అక్టోబర్ 06, ప్రభాతవార్త:** ఎంపీ పో తుగంటి రాములు స్వగ్రా మమైన కల్వకుర్తి మండ లం గుండూర్ గ్రామంలో దసరా పర్వదినాన్ని పుర స్క రించుకొని విజయద శమి వేడుకల్లో పాల్గొన్నా రు. గ్రామస్తులతో కలిసి





దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ రాములు, జమ్మి పూజకు గ్రామస్తులతో కలిసి వెళ్తున్న దృశ్యం

శివాలయం వద్ద ఏర్పాటు చేసిన జమ్మి చెట్టుకు ఎంపీ రాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు గావించారు. శ్రీ మల్లిఖార్జున సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీ రాములును శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీ రా ములు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరు యాంత్రీక జీవితానికి అలవాటు పడి దైవ మార్గానికి దూరమవుతున్నారని, ప్రతి ఒక్కరు దైవమార్గాన్ని అనుసరిస్తే కుటుంబంలో, సమా జంలో సుఖ శాంతులు విరజిల్లుతాయన్నారు. అమ్మవారిని భక్తితో పూజించి కొలిస్తే ఆ ఇంట్లో సుఖ శాంతులతో పాటు అష్టయిష్వర్యాలు సమకూరుతాయని ఆయన పేర్కొన్నారు. సుఖమయమైన జీవితాన్ని మానవులు అలవర్చుకోవాలని, అలాంటి జీవితం ఒక్క అధ్యాత్మిక శక్తి ద్వారానే లభిస్తోందన్నారు. త్వరలోనే గ్రామంలోని ప్రతి వార్డు పర్యటించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తామన్నారు. వంగూరు మండలం నుంచి రంగాపూర్, మొకురాల, గుండూర్ గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి బస్సులు నడిచే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సొంత ఊరికి ఎన్ని పనులు చేసిన ఇంకా చేయాలనే తపన ఎప్పటికి నాలో ఉంటుందని గుర్తు చేశారు. గ్రామ ప్రజలందరికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ మనోహర చెన్నకేశవ, సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వీరయ్య, వెంకట్‌రెడ్డి, కిరణ్ కుమార్‌శర్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

## ఘనంగా దుర్గామాత విగ్రహ నిమజ్జనం

**లింగాల, అక్టోబరు 06 ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రి ఉత్స వాలలో భాగంగా మండల పరిధిలోని సురాపూర్, రాయవరం గ్రామాలలో సెప్టెంబర్ 26న ప్రతిష్టించిన దుర్గామాతను 10 రోజులపాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి బుధవారం సమీప చెరువులో నిమజ్జనం చేశారు. దుర్గామాత ప్రతిమను అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనంలో పురవీధుల గుండా ఊరేగించారు. అమ్మవారి శోభాయాత్రకు మహిళలు బొడ్డెమ్మలు, బతుకమ్మలు, యువకులు కోలాటాలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.



దుర్గామాతను ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

## ఘనంగా విజయదశమి వేడుకలు

**తెల్కపల్లి,అక్టోబరు 06 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో పరిసర గ్రామాల్లో బుధవారం విజయదశమి (దసరా) పర్వదిన వేడుకలు ప్రజలు అంగరంగ వైభవం గా జరుపుకున్నారు. ఉద యం నుంచే మామిడి తోర ణాలతో గృహాలను అలంక రించి నూతన వస్త్రాలను ధరించి తమ పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సాయంత్రం శమీ (జమ్మి) వృక్షము దగ్గరకు చేరుకుని వేద పండితుల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మి పత్రాలను (పచ్చ బంగారం) శనగలను పంచిపెట్టారు. ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, పార్టీల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తెల్కపల్లిలో శమి (జమ్మి) వృక్షం వద్ద పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ సురేఖ బాలగౌడ్

## ఘనంగా దసరా వేడుకలు

**లింగాల, అక్టోబరు 06 ప్రభాతవార్త :** విజయానికి ప్రతీకైన విజయదశమి పురస్కరించుకుని మం డలంలోని ప్రజలు దసరా ఉత్సవాలను బుధ వారం భక్తిశ్రద్ధలతో జరుపు కున్నారు. లింగాలలోని కోదం డరామ స్వామి,



ర్యాలీగా వెళ్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు

ఆంజనేయ స్వామి దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం సాయంత్రం కేతావత్ భద్రునాయక్ తన ఇంటివద్ద నుంచి జెండాను తీసుకుని ప్రధాన రహదారుల మీదుగా పెద్ద ఎత్తున సాగిన ఊరేగింపుగా శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చేరుకుంది. అనంతరం మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య జమ్మిచెట్టుకు షమీ పూజలు నిర్వహించగా భక్తులు తిలకించారు. పండుగ విశిష్టతను పూజారులు, రామాచార్యులు, సుదర్శనచార్యులు వివరించారు. ప్రజలు జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సర్పంచ్ కోనేటి తిరుపతయ్య చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లింగమ్మ, జడ్పీటిసి నేజమ్మ, సింగిల్‌విండో అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రవిశంకర్, డిఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి

### - వర్షాల కారణంగా వారితో ఎమ్మెల్యే టెలికాన్ఫరెన్స్

**దేవరకద్ర రూరల్,అక్టోబరు 06 ప్రభాతవార్త:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకారణంగా దేవరకద్ర నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండా లని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. వర్షాలు ఏకదాటిగా కురుస్తున్న నేపథ్యంలో గురువారం దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాల అధికారులు. ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు షెట్టర్లు తెరవడంతో పాటు సరళాసాగర్ సైఫన్లు తెరుచుకోవడంతో ఆ ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాల రైతులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే ఎక్కడైన వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోతే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని పర్యవేక్షించి వారిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు తమతమ మండలాలలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉ ందన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు సహాయం అందించిన ఉప్పల ట్రస్ట్

**కల్వకుర్తి, అక్టోబర్ 06, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ షఫి గత పది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఇట్టి విషయాన్ని పట్టణ మైనార్టీ సోదరులు ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ గురువారం ఉప్పల మిత్ర మండలి అధ్యక్షులు షేక్ టిప్పు సుల్తాన్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం, 50కేజీల బియ్యాన్ని అందించి ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఏజాస్, నాయకులు అంజద్‌ఖాన్, పరమేష్, ఇక్బాల్, ఫయాజ్, జహీర్, సాజీద్,ఇంతియాజ్, ఫెరోజ్, షారుఖ్, సోహెల్, ఆమేర్, రియాజ్ తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## భక్తి శ్రద్దలతో శమీ వృక్షం ప్రతిష్టాపన..

**పెద్దమందడి, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండలంలోని దొడకుంటపల్లి గ్రామంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరిం చుకొని సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం శమీవృక్షాన్ని ప్రతిష్టించా రు. మొదటగా గ్రామస్థు లు వేదమంత్రాలతో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మంగళవాయి ద్యాలతో ఊరేగొంపుగా వెళ్లి గ్రామంలోని చెరువుకట్ట వెనుక ఏర్పాటు చేసిన స్థలంలో ప్రతిష్టించారు. ఈ వృక్షం శాశ్వతంగా ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ వృక్షం ఏర్పాటుతో ప్రతీ దసరా పండుగకి గ్రామస్థులందరు ఇక్కడే పూజలు నిర్వహించి పండుగ జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెన్నమ్మ, పెద్దలు భగవంత్ రెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆశోక్ కుమార్ రెడ్డి, రాజశేఖర్, యువకులు భాస్కర్, నరేందర్ గౌడ్, రాజగౌడ్, రవీందర్ గౌడ్, రాఘవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శమీ వృక్షాన్ని ప్రతిష్టిస్తున్న గ్రామస్థులు

## భారీ వర్షాలకు రాకపోకలు బందు..

**గోపాల్‌పేట, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రాకపోకలు నిలిచిపోయి చెరువులు కుంటలు నిండి పోయి వాగులు వంకలు పొర్లి పోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గోపాల్‌పేట గ్రామ సమీపంలోని బుద్దారం వైపు ఆర్‌ఎంబీ రోడ్డు పై రూ.2కోట్లతో నిర్మాణం చేపడు తున్న దగ్గర తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు నీటి



గోపాల్‌పేట సమీపంలో బ్రిడ్జి దగ్గర తాత్కాలిక మట్టిరోడ్డుపై నీటి ప్రవాహం దృశ్యం

ఉధృతితికి కొట్టుకొనిపోయి వాహనాలు నిలిచిపోయాయి. గత నెలరోజులు క్రితం కురిసిన వర్షాలకు తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు నీటి ఉధృతికి మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. నీటి ఉధృతికి బ్రిడ్జి దగ్గర ఉన్న విద్యుత్ స్థంభం నేలమట్టం అయ్యి విద్యుత్ అంతరాయం నెలకొంది. ఇలా జరగడం రెండోసారి అంతేకాక వనపర్తి నుండి గోపాల్‌పేట మీదుగా వెళ్లే బస్సులు నిలిచిపోయాయి.. జెర్రిపోతుల వాగు దగ్గర తాత్కాలికంగా వేసి మట్టిరోడ్డు నీటి ఉధృతికి కొట్టుకుపోవడంతో గోపాల్‌పేట మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సులను చిట్యాల రోడ్డు, బుద్దారం నుండి దారిని మళ్లించి బస్సులు వాహనాలు వెళ్లిపోయాయి. దీంతో గోపాల్‌పేటకు వాహనాలు నిలిచిపోయాయి. గోపాల్‌పేట నుండి ఏదారి వెళ్లకుండగా రాకపోకలు నిలిచిపోయాయి. జెర్రిపోల వాగు దగ్గర మట్టిరోడ్డు కొట్టుకుపోవడంతో నాగర్‌కర్నూల్, రేవల్లి వెళ్లే గ్రామాల బస్సులు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. మండల పరిధిలోని తాడిపర్తి, మున్ననూరు, అప్పామిపల్లి మీదుగా వనపర్తికి వెళ్లాలని అనుకుంటే కూడా మున్ననూరు దగ్గర ఉన్న కల్వర్టు రోడ్డుపై నీటి ప్రవాహం ఉండడంతో వాహనాలకు రాకపోకలకు ఇబ్బందులు అయ్యాయి. గోపాల్‌పేట సమీపంలో తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు కొట్టుకుపోవడం సంఘటన దగ్గరకు ఎస్ఐ ఎం.నవీద్ పరిశీలించి వాహనాలు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## ఊకచెట్టు వాగుకు పోటెత్తిన వరద

### -బోరుబావి నుంచి ఉబికి వస్తున్న భూగర్భ జలాలు

**చిన్నచింతకుంట, అక్టోబరు 06 ప్రభాతవార్త :** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు



బోరుబావి నుండి ఉబికి వస్తున్న నీరు



ఊకెచెట్టు వాగుకు పెరిగిన వరద ఉధృతి

మండలంలోని మన్నెవాగు, ఊకచెట్టు వాగులకు వరదనీరు పోటెత్తింది. జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండడంతో కోయిల్‌సాగర్‌కు వరద నీరు భారీగా చేరుకోవడంతో ఐదుగేట్లు ఎత్తి కిందికి వరద నీరును విడుదల చేశారు. దీంతో ఊకచెట్టువాగు అలాగే మన్నెవాగులకు వరదనీరు పోటెత్తడంతో నెల్లికొండి, సీతారాంపేట మధ్య వడ్డెమాన్ బ్రిడ్జిపై వరదనీరు పోటెత్తడంతో పలు వాహనాలు నిలిచిపోయాయి. ఊకచెట్టు వాగులో అడుగడుగునా చెక్ డ్యాంల నిర్మాణాలతో భూగర్బ జలాలు పెరిగి వడ్డెమాన్ సమీపంలోని రైతు కురుమన్న వ్యవసాయ పొలంలో బోరు బావినుంచి నీరు పైకి రావడం చెక్‌డ్యాంల నిర్మాణాల వల్లే భూగర్బ జలాలు పెరిగాయని దీని వెనుక స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషి ఉందని టిఆర్ఎస్ నేతలు తెలుపుతున్నారు. అకాల వర్షాల కారణంగా ఊకచెట్టు వాగు, మన్నెవాగులకు వరదనీరు భారీగా చేరుకోవడంతో వాగులు పొంగి పొర్లుతున్నాయి.

## ఊరూరా దసరా వేడుకలు

### - నిమజ్జనానికి తరలిన దుర్గామాతలు

**చిన్నచింతకుంట, అక్టోబరు 06 ప్రభాతవార్త :** దసరా ఉత్సవాలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం విజయదశమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో తమ పూర్వీకులను స్మరించుకుంటూ తీపి వంటకాలను చేసి తమ ఇష్టదైవాలకు, పూర్వీకులకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని ప్రజలందరు ఊరేగింపుగా శమి వృక్షానికి పూజలు నిర్వహించి శమీ వృక్ష ఆకులను తమ పెద్దవారికి అందించి కాళ్లు మొక్కుతూ ఆశీర్వచనాలు తీసుకున్నారు. దసరా ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్నారు. మండల కేంద్రంలోని గంగాభవాని ఆలయంలో దుర్గామాతను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా కొనసాగింది. అమ్మవారి ముందు చిన్నారులు కోలాటం, బొడ్డెమ్మలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా కొనసాగింది.



దుర్గామాతను నిమజ్జనానికి తరలిస్తూ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వాఖ్యలు చేసిన గ్యాదరి కిశోర్‌పై ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు

**వనపర్తి టౌన్, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై అనుచిత వాఖ్యలు చేసిన గ్యాదరి కిశోర్ పై ఎస్పీ కార్యాలయంలో బీఎస్పీ నాయకులు ఫిర్యాదు చేశారు. గతంలో పోలీసు డిపార్ట్‌మెంట్ లో పని చేసి ఎన్నో వేల మంది జీవితాలు కాపాడి, గురుకుల కార్యదర్శిగా ఎన్నో లక్షల మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్ది, నేడు రాజకీయ రంగంలో ఎదురు లేని బాణంగా దూసుకుపోతున్న బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ను రాజకీయంగా ఎదురుకోవడానికి చేతకాక వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ పై రాజ్రష్ట వ్యాప్తంగా ఎస్పీ లకు కంప్లైంట్ చేయడంలో భాగంగా వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో టౌన్ పోలీసు స్టేషన్ లో కంప్లైట్ చేసి, వెంటనే ఎఫ్ఐఆర్ బుక్ చేసి అరెస్టు చెయ్యాలని జిల్లా బీఎస్పీ పార్టీ నాయకులు జిల్లా ఇన్చార్జ్ గణపురం కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నాగనమోని చెన్నరాములు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బహుజన రమేష్, వనపర్తి నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి, శ్రీరంగాపురం ఎంపీటీసీ గూడెం ఎల్లస్వామి లు కోరారు.



జిల్లా ఎస్పీ కార్యాలయంలోగ్యాదరి కిశోర్ పై కంప్లైట్ చేస్తున్న జిల్లా బీఎస్పీ నాయకులు

## దేవరకద్రలో హోకెత్తిన దసరా రాంలీల వేడుకలు

**దేవరకద్ర రూరల్, అక్టోబరు 06 ప్రభాతవార్త:** దేవరకద్రలో బుధవారం రాత్రి దసరా విజయదశమి రాంలీల వేడుకలు హోరెత్తిపోయాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రామ దేవత పోచమ్మ గుడి పక్కనున్న రాంలీల మైదానంలో రావణాసురిడి దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతం జనంతో కిటకిటలాడింది.



దేవరకద్రలో రాంలీల కార్యక్రమానికి హాజరైన పట్టణప్రజలు

**కళాప్రతిభ కనబరచిన వారికి బహుమతుల అందజేత..** దేవరకద్రలో ప్రతిష్టించిన దేవినవరాత్రుల సందర్భంగా దుర్గామాత వేడుకలలో దాదాపు 9 రోజులపాటు వివిధ కళాప్రదర్శనలలో ప్రతిభ కనబరచిన వారికి నిర్వహకులు బహుమతులను అందజశారు. ఈ కార్యక్రమంలో యంపీపీ రయాశ్రీకాంత్‌యాదవ్,టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి,మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, నిర్వహకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, తిప్పారెడ్డిలతో పాటు నాయకులు కూరగాయాల ఆనంద్, కొండ భాస్కర్‌రెడ్డి, శివానంద్, మున్నూరు భాలరాజ్, సాయికిరణ్, హన్మిరెడ్డి, రఘు వీరవర్మ, ఉపసర్పంచ్ రాందాసు, వెంకటేష్, దొబ్బలి అంజనేయులు, బాలస్వామి, చంద్రయ్యశెట్టి, యుగేందర్‌రెడ్డి, చల్మారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జకీ, రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డిలతో పాటు గ్రామపెద్దలు, యవకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు

**అమ్మవారి లడ్డు వేలం రూ.60,116** | **ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు**

**కల్వకుర్తి, అక్టోబర్ 06, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో శరన్నవ రాత్రోత్సవాలను పురస్కరించుకొని బుధవారం అమ్మవారిని పుష్పాలంకరణలో చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ నిర్వహించి నిత్య పూజలు నిర్వహించారు. 9 రోజుల పాటు అమ్మవారికి నిత్య పూజలు నిర్వహించి శరన్నవరాత్రోత్సవాల కార్యక్రమాలను అంగరంగా వైభవోపేతంగా గావించారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారిని గురువారం అశ్వ వాహనంపై పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వద్ద అశ్వవాహనంలో పుష్పాలంకరణలో ఉన్న వాసవీమాత విగ్రహాన్ని ఉంచి ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రాజేశ్వరి, జూలూరి రమేష్‌బాబు, రోహిత్, జూలూరి అరుణ, జూలూరి రఘు, రేష్మా, రోహిణిలు, జూలూరి సింధు రాకేష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు మహిళలు అమ్మవారికి మంగళి హారతితో ఘన స్వాగతం పలికారు. మహిళలు, యువతులు దాండియా, కోలాటాలతో ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగింది. దుర్గాంబిక రైస్‌మిల్లులో అవబృద స్నానం, పూజలు, శ్రీ వాసవీమాత అమ్మవారి ఉద్వాపన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమ్మవారి ముందు కుంభం పోయుట, భక్తులచే ఖడ్గములు వేయించుట కార్యక్రమాన్ని ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగా వైభవంగా నిర్వహించారు. 9 రోజుల పాటు విశేషంగా నిత్య పూజలందుకున్న అమ్మవారి లడ్డును శ్రీ జూలూరి రామనాథం రూ.60,116లకు వేలం పాటలో దక్కించుకున్నారు. 9 రోజుల పాటు అమ్మవారికి ధరించిన చీరలను వేలం పాట నిర్వహించడంతో పలువురు అమ్మవారి చీరలను వేలంలో దక్కించుకున్నారు. వేలం లడ్డు, అమ్మవారి చీరలను దక్కించుకున్న వారిని ఆలయ ఉత్సవ కమిటీ



అమ్మవారి లడ్డుతో శ్రీ జూలూరి రామనాథం



అలంకరణలో అమ్మవారు



శోభయాత్రకు అమ్మవారిని తీసుకెళ్తున్న దృశ్యం



ఆలయంలో జమ్మి వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. శోభయాత్రలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, ఎస్ఐ రమేష్‌యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు గావించారు. వాసవీమాత అమ్మవారిని నిమజ్జనం చేశారు. దసరా పర్వదినాన వాసవీమాత ఆలయంలో ఆలయ ఫౌండర్ జూలూరి రమేష్‌బాబు అధ్యక్షతన జమ్మి పూజ నిర్వహించి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు కంది ప్రవీణ్, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు నారాయణ రాజు, దుగ్గి వెంకటేష్, కల్వకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్, మండల వైస్ ఎంపీపీ కొందూర్ గోవర్ధన్, శివ్వ జగదీశ్వర్, అదనపు కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, గోపాల్,నాయకులు వాస శేఖర్, మిల్లర్లు సభ్యులు మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం, అవోపా మరియు ఆర్యవైశ్య, యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీక్లబ్ మరియు వాసవి వనితాక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం-వరదకు రోడ్డు తెగి ప్రయాణికులకు కష్టాలు

**వనపర్తి టౌన్, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** వనపర్తిలో కురిసన భారీ వర్షాలకు వనపర్తి-నర్సింగాయిపలిన్ల మధ్య జెర్రిపోతుల మైసమ్మవాగు వద్ద రోడ్డుతెగి రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జెర్రిపోతుల మైసమ్మ వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణంలో ఉంది అందువల్ల పక్కనే పైపులు వేసి వాహనాలు వెళ్లేందుకు తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. దానిపైనే నాగర్‌కర్నూల్, హైదరాబాద్ వాహనాలు, మనుషులు రాకపోకలు కొనసాగుతున్నాయి. కాగా బుధవారం రాత్రి వర్షం కురవడంతో వరద రావడంతో తాత్కాలిక మట్టి రోడ్డు తెగిపోయింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగు అవతలి వైపు వనపర్తి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఉంది అందులో రోగులు, గర్బిణీ స్త్రీలు, బాలింతలు, ఇతర రోగులు వైద్యం పొందుతున్నారు. రోగులను తెగిన రోడ్డునుంచే ఆసుపత్రికి తీసుకెళ్లి ఉంది ఆసుపత్రిలో రోగులకు వనపర్తి నుంచి వారి బంధువులు ఆహారం నీరు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వనపర్తి నర్సింగాయిపల్లి మధ్య రోడ్డు తెగడంతో చిట్యాల-చిన్నగుంట-బుద్దారం మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు వాహనాలను మళ్లించారు. వనపర్తి జిల్లా ఆసుపత్రికి వెళ్లాలంటే బుద్దారం వెళ్లి అటు నుంచి గోపాల్‌పేట మీదుగా నర్సింగాయిపల్లి సమీపంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని చేరుకోవాల్సి వస్తుంది. నర్సింగాయిపల్లి, తాడిపర్తి, గోపాల్‌పేట వెళ్లేందుకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. అంతేకాక నర్సింగాయిపల్లి, తాడిపర్తి, గోపాల్‌పేట మీదుగానే



జెర్రిపోతుల మైసమ్మ దగ్గర తెగిపోయిన తాత్కాలిక మట్టిరోడ్డు

గోపాల్‌పేట మండలం, రేవల్లి మండలం, కోడేరు మండలం, పెద్దకొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం ఉంది. జెర్రిపోతుల మైసమ్మ వాగు వద్ద రోడ్డు తెగిపోవడంతో ఆ మండలాల గ్రామాలకు బస్సులు, వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డు తెగినచోట నీటి ఉధృతం ఉండటంతో ప్రయాణికులు వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే జెర్రిపోతుల మైసమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడం వలనే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాక పనులను వేగవంతంగా చేసి బ్రిడ్జి నిర్మాణం సత్వరం పూర్తి చేసి భవిస్యత్‌లో రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## కోయిల్‌సాగర్‌కు పోటెత్తిన వరదనీరు

### -5 షెట్టర్లు తెరచి దిగువకు నీటి విడుదల
### -పోటెత్తిన కోయిలకొండ,అంకిళ్ళ వాగుల ఉధృతి
### - కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు కొనసాగుతున్న నీటి సరఫరా

**దేవరకద్ర రూరల్,అక్టోబరు 06 ప్రభాతవార్త:** వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో జిల్లాలోని భారీ నీటి పారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌కు వరద ఉధృతి గురువారం హోరెత్తింది. దీంతో గురువారం తెల్లవారుజామున ప్రాజెక్టు 5 షెట్టర్లను ఫీటున్నర ఎత్తు తెరచి దిగువకు నీటిని విడుదల చేశారు. అయితే ఈ ఏడాది ఇంత పెద్ద మొత్తంలో షెట్టర్లను తెరువడం అదే రెండవసారి. ప్రాజెక్టుకు 13 షెట్టర్లు ఉన్నాయి. అయితే ముందు జాగ్రత్తగా ఈ షెట్టర్లను తెరిచారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ప్రస్తుతం దానికన్న ఎక్కువగా ప్రాజెక్టులో నీరు 32.6 ఫీట్లకు వచ్చి చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుడటంతో ప్రాజెక్టులోకి వచ్చి చేరే అంకిళ్ళ,కోయిలకొండ పెద్దవాగుల నుండి నీరు ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో వచ్చి చేరడం మళ్ళీ ప్రారంభమైంది. దీంతో ప్రాజెక్టులో త్వరగా నీటి స్థోమత పెరుగుతుంది. గత నెల 10న కూడ ఇదే తరహాలో ప్రాజెక్టు 5 షెట్టర్లను తెరిచారు. ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో ఆయకట్టుకు నీటి సరఫరాను అలాగే కొనసాగిస్తున్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు షెట్టర్‌ను తెరువడంతో బండర్‌పల్లి వాగు ఉధృతి గణనీయంగా పెరిగింది.



5 షెట్టర్లను తెరచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

## జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ తప్పక విజయం సాధిస్తాడు..

### - తెలంగాణ సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా అమలు కావాలి..
### - ఎంపీపీ పద్మావతి వెంకట్‌నారయణ, మండల టీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు వడ్డె రాములు

**వనపర్తి ప్రతినిధి (మదనాపురం), అక్టోబర్ 06 ప్రభాతవార్త:** జాతీయ రాజకీయాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పక విజయం సాధించి భారత దేశానికి మెచ్చిన గొప్ప నాయకుడు అవుతాడని మదనాపురం మండల ఎంపీపీ జున్ను పద్మావతి వెంకట్‌నారాయణ,మండల టీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు వడ్డె రాములు అన్నారు. సీఎం కేసీఆర్ బుధవారం టీఆర్ఎస్ పార్టీ ని పేరు మార్చి జాతీయ పార్టీ బీఆర్ఎస్ గా పేరును ప్రకటించిన నేపథ్యంలో మదనాపురం మండల కేంద్రంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ లో బలహీన వర్గాలు, రైతుల అభివృద్దే లక్ష్యంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా అమలు పరచాలన్నదే కేసీఆర్ లక్ష్యం అని వారు అన్నారు. లక్ష్య సాధన, దృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా అభివృద్ధి చేసి చూపించిన కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో ఉన్నతంగా రాణిస్తారని కేసీఆర్ విజయానికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాం నారాయణ, నాయకులు గోపి స్వామి, రవీందర్ రెడ్డి, బాలకృష్ణ, వెంకటేష్, అశోక్, శ్రీనివాసులు, శాంతన్న ఉన్నారు.





కేక్ కట్ చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు, బాణసంచా కాలుస్తున్న మదనాపురం టీఆర్ఎస్ నాయకులు

## దేవరకద్రలో జమ్మివృక్షానికి పూజలు

**దేవరకద్ర రూరల్, అక్టోబరు 06 ప్రభాతవార్త:** దేవరకద్రలో బుధవారం దసరా విజయదశమి పండుగ వేడుకల సందర్భంగా స్థానిక శ్రీ క్రపన్నాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో పట్టణ ప్రజలు జమ్మివృక్షానికి పూజలు చేశారు. సర్పంచ్ కొండ విజయ లక్ష్మీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సాంద్రాయరీతిలో నిర్వహించారు. సన్నాయివాయిద్యాల మధ్య పట్టణప్రజలంతా జమ్మిచెట్లువద్దకు చేరుకొని పురోహితుల మధ్య ఈ పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మిఆకును ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ విజయలక్ష్మీతో పాటు పట్టణ ప్రజలు అదికసంఖ్యలో పాల్గొన్నారు.



దేవరకద్రలో పూజకు ఊరేగింపుగా వస్తున్న పట్టణప్రజలు

**ఆయా గ్రామాలలో..** దేవరకద్ర మండలంలోని ఆయా గ్రామాలలో కూడ బుధవారం దసరా విజయదశమి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జమ్మివృక్షానికి సాంద్రాయరీతిలో పూజలు చేశారు.అనంతరం జమ్మిఆకును ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో ఘనంగా దసరా ఉత్సవాలు

### - గ్రామ గ్రామాన దుర్గమ్మల శోభాయాత్రలు
### - బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు పట్ల బాణాసంచా లు కాల్చిన టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**భూత్పూర్, అక్టోబరు 06 ప్రభాతవార్త :** దసరా ఉత్సవాల్లో భాగంగా భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాలలో బుధవారం బతుకమ్మ, దుర్గమ్మల శోభాయాత్రలు ఘనంగా జరిగాయి.



దసరా ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ బస్వరాజ్‌గౌడ్ తదితరులు



భూత్పూర్ చౌరస్తాలో బాణాసంచాలు కాలుస్తున్న టిఆర్ఎస్ శ్రేణులు



అమిస్తాపూర్‌లో దుర్గామాత శోభాయాత్ర

భూత్పూర్‌తో పాటు అమిస్తాపూర్, గోప్లాపూర్, మద్దిగట్ల, పోతులమడుగులలో దుర్గామాతల శోభాయాత్ర, ఊరేగింపులు ఘనంగా జరిగాయి. భూత్పూర్‌లో జరిగిన దసరా ఊరేగింపు, దుర్గామాత శోభాయాత్రలో మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు సత్తూరు నారాయణగౌడ్, తోక మురళీధర్‌గౌడ్, మానెమోని సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, దళితరత్న బోరింగ్ నర్సింహులు, గడ్డం రాములు, గడ్డం యాదయ్య, గడ్డం ఎల్లప్ప, గొడుగు వెంకట్‌రాజు, చీపుర్ల తిరుపతయ్య, సత్తూరు అశోక్‌గౌడ్, సత్తూరు రాకేష్‌గౌడ్, సత్తూరు సురేష్‌గౌడ్, మూస బాలస్వామి, వడ్ల బ్రహ్మయ్య, గడ్డం ప్రేమ్, మేకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సీఎం కెసిఆర్ భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ప్రకటించిన నేపథ్యంలో పార్టీ నాయకులు భూత్పూర్ జాతీయ రహదారి కూడలిలో బాణాసంచాలు పేల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## వృద్దుడి దారుణ హత్య..

### - అక్రమసంబంధమే హత్యకు కారణమంటున్న కుటుంబసభ్యుల ఆరోపణ

**ఖిల్లాఘణపురం, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మానాజిపేట గ్రామానికి చెందిన గ్రామ పంచాయితీ కార్మికుడు గజ్జి రాములు(62) ను కట్టెతో బాది హతమార్చినట్లు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే మృతుడు గజ్జి రాములుకు అదే గ్రామపంచాయితీలో పంచాయితీ కార్మికురాలిగా పని చేస్తున్న ఎల్లమ్మ గత 3సంవత్సరాలుగా అక్రమ సంబంధం కొనసాగుతుందని మృతుడి కుమారుడు తెలిపాడు. ఎల్లమ్మ భర్త ఆంజనేయులు అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న గజ్జి రాములును పట్టుకొని పలుమార్లు హెచ్చరించినట్లు తెలిసింది. విజయదశమి రోజు రాత్రి ఎస్సీ కాలనీ లోని కేశంగారి దాసు బాడుపడ్డ ఇంటి ఆవరణలో ఎల్లమ్మ, మృతుడు రాములు కలిసి ఉండడాన్ని గమనించిన ఎల్లమ్మ భర్త మద్దిగట్ల ఆంజనేయులు కోపోదృక్తుడై రాములు పై కర్రతో దాడి చేసి హతమార్చాడని మృతుడి కుమారుడు తెలిపారు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టు ఆడుతున్నా రాములుకు రెండు చేతులు, దౌడలు, నోటి నుండి తీవ్ర రక్త స్రావం మధ్య కేశంగారి దాసు పాడుబడ్డ ఇంటి ఆవరణలో స్పృహ లేకుండా పడి ఉండడాన్ని గుర్తించామని మృతుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ వెంకటేష్ గౌడ్

## గ్రామ పంచాయితీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

### - సర్పంచ్ గోవిందులావణ్య



గ్రామ పంచాయితీ సిబ్బందికి యూనిఫాంలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**బిజినేపల్లి, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** గ్రామ పంచాయితీ సిబ్బంది ప్రజలకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి అని పాలెం గ్రామ సర్పంచ్ గోవింద లావణ్య అన్నారు. దసరా పండగను పురస్కరించుకోని మండల పరిధిలో ని పాలెం గ్రామ పంచాయితీ సిబ్బందికి సంవత్సరానికి సరిపడ రెండు జతల యూనిఫాంలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రమ సేవతో పాటు కరోనా సమయంలో ఏంతో సేవ చేశారని కోనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు.సర్పంచ్ భర్త నాగరాజ్. వార్డ్‌మెంబర్లు, గ్రామపంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## నల్ల బెల్లం పట్టివేత

**బిజినేపల్లి, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** అక్రమంగా ఓ డిసియం వాహణంలో నల్ల బెల్లం తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలిసులు నల్ల బెల్లం పట్టుకోని కేసు నమెదు చేశారు, ఇందుకు సంబందించిన వివరాలు ఇలా బుదవారం ఆర్ధరాత్రీ దాదాపు 3గంటల సమయంలో డిసియం టిఏస్12డి3692 వాహనం మండల పరిధిలోని పాలెం వద్ద అతి వేగంగా వెలుతుండగా రాత్రి వాహనాలు తనికి చేస్తుండగా అనుమా నస్పందంగా వెలుతున్న వాహనాన్ని ఆపి డ్రైవరును విచారించడంతో వాహనంలో నల్లబెల్లం ఉందని చెప్పడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఏస్సై ఓబులురెడ్డి తెలిపారు.వాహనంలో 160 బస్తాల నల్ల బెల్లంఉందని ఏక్సైజ్ ఆదికారులకు అప్పజేప్పుతామని తెలిపారు.



నల్లబెల్లం వాహణం